# గరళకంఠా నమోస్తుతే..

- వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- ప్రత్యేక పూజలు చేసి ఉపవాస దీక్షలు విరమణ


తాండూరు: భద్రేశ్వర దేవాలయంలో శివుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

పరిగి, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా పరిగి పట్టణంలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం, బ్రాహ్మణవాడ శివాలయం, పట్టణంలోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పరిగి మార్కెట్‌యార్డులో మహా రుద్రాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. బ్రాహ్మణవాడ శివాలయంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి–ఉమాదేవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లికార్జున స్వామి ఆలయం వద్ద స్వామి వారి దర్శనం అనంతరం భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాద వితరణ చేశారు.

**వికారాబాద్:** వికారాబాద్ పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరాలయం, మల్లికార్జునస్వామి ఆలయం, శివాలయంతో పాటు మండల పరిధిలోని పులుసుమామిడి గ్రామ శివారులోని పార్వతీ పరమేశ్వరుడి ఆలయం, మదన్‌పల్లి సమీపంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివనామ స్మరణతో ఆలయాల పరిసరాలు మార్మోగాయి. ఆయా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

**తాండూరు/తాండూరు రూరల్:** నియోజకవర్గంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. అంతారం తండాలోని శ్రీభూకైలాస్ ఆలయం, బషీరాబాద్ మండలం నీళ్లపల్లిలోని ఏకాంబరి, జీవన్గి, పెద్దేముల్ మండలం తట్టెపల్లి సమీపంలోని అంబురామేశ్వర ఆలయం, యాలాల మండలం సంగెంకుర్ధులోని సంగమేశ్వరఆలయంతో పాటు తాండూరు మున్సిపల్ పరిధిలోని శ్రీభావిగి భద్రేశ్వర ఆలయం, చెరువెంటి ఈశ్వరాలయం, అంతప్పబావి శివాలయం, కోటేశ్వర ఆలయంతో పాటు పలు శివాలయాల్లో శివుడికి భక్తి శ్రద్ధలతో భక్తులు,


పరిగిలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

ప్రజా ప్రతినిధులు, అధికారులు, జలాభిషేకం, పాలాభిషేకం, రుద్రాభిషేకం, అర్చనలు చేశారు. ఉపవాక్ష దీక్షలు విరమించడానికి భక్తులు శివుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. హర హర మహాదేవా... శంబో శంకర...అంటూ భక్తుల శివనామస్మరణతో తాండూరు నియోజక వర్గంలోని శివాలయాలు మార్మోగాయి. బ్రహ్మకుమారి సమాజం తాం డూరు శాఖ కేంద్రంలో ఇన్‌చార్జి జగదేవి ఆధ్వర్యంలో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి భూకైలాస్‌లో ప్రత్యేక పూజలు చేశారు. గిరిజన మహిళలు భవానీ మాతకు బోనమెత్తి భక్తిని చాటుకున్నారు.

**కొడంగల్:** కొడంగల్, దౌల్తాబాద్ మండలాలోని శైవక్షేత్రాలు ప్రత్యేక పూజలతో శివనామ స్మరణ మార్మోగింది. పట్టణంలోని మహాదేవుని, గాడిబావి శివాలయాల్లో ఉదయం నుంచి భక్తులు బారులు తీరి శివలింగానికి పంచామృతాభిశేకం, బిల్వార్చన, అష్టోత్తర శతనామావళి, రుద్రాభిశేకం తదితర పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు కృష్ణజోషి ఆధ్వర్యంలో జరిగాయి. పట్టణ శివారులోని గాడిబావి శివాలయంలో శివుడిని దర్శించుకొని ఉపవాస దీక్షను విరమించేందుకు భక్తులు బారులు తీరారు.

**బొంరాస్‌పేట:** బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. బొంరాస్‌పేట సమీపంలోని శ్రీసంగమేశ్వర దేవాలయం, నాగిరెడ్డిపల్లి సమీపంలోని శ్రీపరమేశ్వర దేవాలయానికి మండలంలోని భక్తులే కాకుండా ఇతర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులు మారేడు దళాలు, మోదుగ పూలతో పూజించి అభిషేకాలు చేశారు. పండ్లు నైవేద్యంగా సమర్పించారు. గౌరారం, దేవులానాయక్‌తండా, మెట్లకుంట, రేగడిమైలారం గ్రామాల్లోని శివాలయాలలో భక్తులు శివుడికి పూజలు చేశారు. దేవాలయాలలో రాత్రంతా భజనలు చేసి జాగారం చేశారు.


తాండూరు రూరల్: భూ కైలాస్‌లో ఎమ్మెల్యే బుయ్యని పూజలు..


పరిగి: బ్రాహ్మణవాడ శివాలయంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు


కొడంగల్: గాడిబావి శివాలయంలో బారులు తీరిన భక్తులు


పరిగిలోని శ్రీ మల్లికార్జున స్వామి ఆలయంలో ..


తాండూరు: ఆలయంలో క్యూలో వేచి ఉన్న భక్తులు

**కులకచర్ల :** మండలంలోని పలు గ్రామాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తుల తో కిటకిటలాడాయి. మండలంలోని పాంబండ రామలింగేశ్వరాలయం జనసంద్రంగా మారింది. వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చి పరమశివుడికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉపవాసం ఉన్న భక్తులు రాత్రి వేళ అక్కడే నిద్రించి దీక్షలను విరమిస్తారు. దీంతో భక్తుల భద్రత కోసం పోలీసులు ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నర్సమ్మారాములు, ఈవో సుధాకర్ భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. చౌడాపూర్ మండలంలోని మందిపల్ గ్రామంలో హోంకారేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా శివాలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు రాజశేఖర్ ఆధ్వర్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.


కులకచర్ల పాంబండ దేవాలయంలో ...

**దోమ :** మండల పరిధిలోని ఊటుపల్లి గ్రామంలో మహా శివరాత్రి పర్వదిన వేడుకలను పురస్కరించుకొని పార్వతీ పరమేశ్వరుల పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉపవాస దీక్షలు చేపట్టిన శివ భక్తులు గ్రామంలోని వీధుల గుండా పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామ స్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మామిళ్ల నర్సిములు, జంగయ్య, గోపాల్, నాగార్జున్, రాజేశ్‌రెడ్డి, మలేశ్ తదితరులు పాల్గొన్నారు.

**మర్పల్లి :** మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఉపవాస దీక్షలు విరమించారు. మర్పల్లి ఆలయంలో ఆర్ఎస్ఎస్–ఎస్‌హెచ్‌డీఎస్, శంభాజీ మహరాజ్ యూత్ అధ్వర్యంలో భక్తులకు పండ్లు పంపిణీ చేశారు.


తాండూరు రూరల్: బోనమెత్తిన గిరిజన మహిళలు


వికారాబాద్: ఆలయంలో శివలింగం అలంకరణ


కొడంగల్: పూజలు చేస్తున్న మహిళలు

## ఘనంగా శివపార్వతుల కల్యాణం



బొంరాస్‌పేట, మార్చి 8 : దుద్యాల మండలంలోని పోలేపల్లి గ్రామంలో శుక్రవారం శివ పార్వతుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పురోహితులు శివపార్వతులకు ఘనంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు హాజరయ్యారు.

## మహిళా ఉద్యోగులకు సన్మానం



మర్పల్లి, మార్చి 8 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులను సన్మానించినట్లు సీఐ అంజనేయులు తెలిపారు.. శుక్రవారం మోమిన్‌పేట సర్కిల్ పరిధిలోని మర్పల్లి, మోమిన్‌పేట, నవాబుపేట్ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో భాగంగా ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్న తెలియ జేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పీఎస్‌ల ఎస్సైలు శ్రీధర్ రెడ్డి, భరత్ భూషన్, అరవింద్, పోలీస్ సిబంది పాల్గొన్నారు.

## కుటీర పరిశ్రమలతో ఆర్థికాభివృద్ధి


గౌతాపూర్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ విమల

తాండూరు రూరల్, మార్చి 8 : మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తోడ్పాటునిస్తాయని మండల పరిధిలోని కరణ్‌కోట ఎస్సై విమల అన్నారు. బీఆర్ఎస్ నియోజకర్గ కన్వీనర్ శకుంతల దేశ్‌పాండే ఆధ్వర్యంలో 'రోహితన్న చేయూత' కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లో పలువురు మహిళలు శిక్షణ పొందారు. శుక్రవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్సై అపర్ణ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రపంచంలో వస్తున్న మార్పులను అనుగుణంగా నేటి మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఎంపీటీసీల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటికే మహిళలు టైలరింగ్, ఎంబ్రాయిడరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్‌లో శిక్షణ పొందారని తెలిపారు. మనిషి ఆహార అలవాట్లలో మార్పులు వస్తున్నాయని, దానికి అనుగుణంగా కుటీర పరిశ్రమల ద్వారా ఆరోగ్య కరమైన ఆహార పదార్థాలు తయారు చేసి ప్రజలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళలు సద్గుణ, పుష్పవతి పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మహిళా కానిస్టేబుళ్లను సన్మానించిన ఎస్సై శంకర్

యాలాల, మార్చి 8: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సై శంకర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమన్నారు. అన్ని రంగాల్లో విజయాలు సాధించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### పూజలకు అనుమతి ఇవ్వ లేదని
## రోడ్డుపైనే భజన

బొంరాస్‌పేట, మార్చి 8 : మండలంలోని మెట్లకుంట గ్రామానికి సమీపంలోని కుమ్మరికుంట శివాలయంలో శివరాత్రి సందర్భంగా పూజలు చేసు కోవడానికి పోలీసులు అనుమతి ఇవ్వ నందుకు నిరసనగా గ్రామానికి చెందిన భక్తులు శుక్రవారం రోడ్డుపైనే భజనలు చేసి నిరసన తెలిపారు. పట్టా భూమిలో ఉన్న ఈ శివాలయం విషయంలో కొన్నే ళ్లుగా కోర్టులో వివాదం ఉంది. శివా లయంలో పూజలకు అనుమతి లేనందున భక్తులను పోలీసులు అనుమతించ లేదు. పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, బొంరాస్‌పేట ఎస్సై అబ్దుల్ రవూఫ్ భక్తులకు ఇదే విష యమై వివరించారు. కోర్టు ఆదేశాలను అందరూ గౌరవించాలని డీఎస్పీ కోరారు.

### అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు

కులకచర్ల, మార్చి 8 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా మృతి చెంది ఉన్న అనాథ వృద్ధురాలి(70)కి పోలీసులు, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. శుక్రవారం కులకచర్ల ప్రభుత్వాస్పత్రి ఎదుట వృద్ధురాలు మృతి చెందిన విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు విచారించగా మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన సత్యమ్మ(70)గా గుర్తించారు. ఆమెకు సంబంధించిన వారు ఎవరూ రాకపోవడంతో పోలీసులు కులకచర్ల గ్రామ పంచాయతీ సిబ్బందికి సమాచారం అందించి వారి సహాయంతో అంత్యక్రియలు నిర్వహించినట్లు ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపారు.

### ఉప వాస దీక్షల విరమణ

కందుకూరు, మార్చి 8 : మహా శివరాత్రి పర్వదినాన్ని మండలంలో ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచి సాయంత్ర వరకు ఉప వాస దీక్షలు ఉన్న భక్తులు సాయంత్రం దేవాలయాలకు వెల్లి పండ్లతో దీక్షలను విరమించారు.

## శ్రీశైలం వెళ్లిన శివస్వాములు



కులకచర్ల, మార్చి 8 : 41 రోజుల పాటు శివదీక్షలు చేసిన స్వాములు మల్లికార్జున స్వామి దర్శనం కోసం శుక్రవారం శ్రీశైలం బయలు దేరి వెళ్లారు. మల్లికార్జున సేవా సమితి నాయకులు మోత్కూర్ చెన్నయ్య, అయ్యలగారి కృష్ణయ్య గురుస్వాముల ఆధ్వర్యంలో శివస్వాములు ఇరుముడులు ధరించి శ్రీశైలం వెళ్లారు. అంతకుముందు మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం, పాంబండ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

## ఆరు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం



పెద్దేముల్, మార్చి 8 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఆరు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎస్సై గిరి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని మంబాపూర్ శివారులో గురువారం సాయంత్రం అనుమతి లేకుండా ఆరు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. అదే సమయంలో విధుల్లో ఉన్న పోలీసులు ట్రాక్టర్లను ఆపి అనుమతి పత్రాలను అడిగారు. వారు చూయించక పోవడంతో ఆరు ట్రాక్టర్లను పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



తాండూరు రూరల్, మార్చి 8 : తాండూరు మండలం, సంగంకలాన్ గ్రామ పంచాయతీలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. మాజీ సర్పంచ్ మేఘనాథ్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో రూ.15 లక్షల విలువైన సీసీ రోడ్డు పనులు చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వాలీబాల్ విజేతలకు బహుమతులు ప్రదానం

కందుకూరు, మార్చి 8 : మహా శివరాత్రి సందర్భంగా మండల కేంద్రంలోని నవతరం యూత్ ఆధ్వర్యంలో దివంగత భాస్కర్ రావు జ్ఞాపకార్థం వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. ఇందులో విజయం సాధించిన దీలీప్ జట్టుకు రూ.5,555.. రెండో విజేత ఎండీ అజీజ్ జట్టుకు రూ.2,222 నగదుతో పాటు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు అజీజ్, కార్తీక్, దీక్షిత్‌రెడ్డి, సభ్యులు రాజశేఖర్ గుప్తా, గణేశ్, సాయికుమార్, రాజశేఖర్‌రెడ్డి, మహేందర్, చోటు, నాగార్జున, దీలీప్, గౌతమ్, మనోహర్, నవీన్, సూరి యువకులు పాల్గొన్నారు.

## లారీ బైక్ ఢీ.. ఒకరి మృతి

పరిగి టౌన్, మార్చి 8 : లారీ బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఎస్సై సంతోశ్‌కుమార్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని సయ్యద్‌పల్లికి చెందిన పొట్టిగారి సత్యయ్య (36) గ్రామం నుంచి చిట్యాల్ వైపు బైక్‌పై వెళ్తుండగా గ్రామ శివార్లలోని ఏడు కానల దగ్గర ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన సత్యయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-311806-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## 3కే వాకథాన్..


3కే వాకథాన్‌లో పాల్గొన్న మహిళలు

ఆర్కేపురం, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొత్తపేటలోని ఓజోన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కొత్తపేట నుంచి ఎల్బీనగర్ చౌరస్తా వరకు 3కే వాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓజోన్ హాస్పిటల్స్ ఎండీ.దీప్తి మాట్లాడుతూ.. వెనుకబడిన షెడ్యూల్డ్ తరగతులకు చెందిన 10,000 మంది పాఠశాల బాలికలను లక్ష్యంగా చేసుకుని హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని అమలు చేయడం 2024లో కీలకమైన అంశం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.పూజిత, శ్రీనివాస్‌రావు, మధుసూదన్‌రెడ్డి, గోపీచంద్, పవన్‌నాగ్ తదితరులు ఉన్నారు.

### మహిళలకు సన్మానం..

కందుకూరు, మార్చి 8 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బీఆర్ఎస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు ఎంపీటీసీ తాండ్ర ఇందిరమ్మ దేవేందర్ కోరారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దాసర్లపల్లి గ్రామంలో మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళలకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. మహిళలకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవేందర్, మహిళలు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ } 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962